‘శ్రీరస్తు ‘తో  పూర్తి సమాచారం ....స్పీకర్ సురేశ్ రెడ్డి

వైవాహిక సంప్రదాయాలను, మరోవైపు ఆధునిక జీవనశైలి గురించి  ‘శ్రీరస్తు‘  అటు తెలుగులోను, ఇటు ఇంగ్లీష్‌లోను సమగ్ర సమాచారం అందించిందని  శాసనసభ స్పీకర్ శ్రీ కె. ఆర్. సురేశ్ రెడ్డి  ప్రశంసించారు.  దేశంలోనే  మొట్టమొదటి ద్విభాషా పక్షపత్రిక  ‘శ్రీరస్తు ‘ ప్రారంభ సంచిక  విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని జలవిహార్‌లో  ప్రముఖుల సమక్షంలో అక్టోబర్ 12న  బుధవారం  జరిగింది. ప్రారంభసంచికను  కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన  శాసనసభ స్పీకర్  శ్రీ కె. ఆర్.  సురేశ్ రెడ్డి  ఆవిష్కరించారు.  ఈ  సందర్భంగా సురేశ్ రెడ్డి మాట్లాడుతూ  శ్రీరస్తు పక్షపత్రిక  నాణ్యమైన సమాచారాన్ని అందిస్తోందని   , కాలానికి అనుగుణమైన సమాచారాన్ని ఇచ్చేలా ఈ పక్షపత్రిక ను తీర్చిదిద్దారని   ప్రశంసించారు.  సమాచార హక్కు  అమల్లోకి వచ్చినరోజే ఈ పక్షపత్రిక  కూడా విడుదల కావడం, ఇందులో కూడా మీకు అవసరమైన సమాచారం తెలియజెప్పే విధంగా ఉండటం గమనించవలసిన విషయమన్నారు.

‘  శ్రీరస్తు‘  సంస్థ లవ్ ఎట్  ఫస్ట్ సైట్ లాగా మేరేజ్  ఎట్ ఫస్ట్ సైట్  అని చెప్పడంలోనే   విభిన్నతను కనబరిచిందన్నారు.   మన సంస్కృతిలో    పెద్దల సమ్మతితో జరిగే  సంప్రదాయ వివాహానికే ప్రాధాన్యం ఉందన్నారు.  అలాంటి వివాహాలు, సంప్రదాయాలను నేటి ఇంగ్లీష్ మోజులో పడి మనం మరచిపోతున్నామని, ఈ పక్షపత్రిక  మన  సంప్రదాయాలను, దాని విశిష్టతను తెలియచెప్పడం మంచి విషయమన్నారు.  ఈ పక్షపత్రిక లోని అంశాలు అందరికీ ఉపయోగపడేలా ఉన్నాయన్నారు.   సాంప్రదాయక విషయాలతో ఉన్న ఈ పక్షపత్రిక   ముఖ్యంగా  గృహిణులకు ఎంతగానో ఉపయోగపడుతుందని స్పీకర్ పేర్కొన్నారు. లైఫ్ కంటే  లైఫ్ స్టయిల్ ఎక్కువ. ఇందులో సంప్రదాయంతోపాటు కొంత ఆధునికతను కూడా జోడించారు. ముఖ్యంగా నేటి లైఫ్‌స్టయిల్‌ను కూడా వివరించి భిన్నత్వాన్ని  పక్షపత్రిక  నిర్వాహకులు ప్రదర్శించారు.  ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ   మారుమూల  గ్రామాల్లోకి  వెళ్ళే విధంగా నేడు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఎ.పి. బ్రాడ్‌బ్యాండ్ ద్వారా అన్ని గ్రామాలకు ఐటి ఫలాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ శ్రీరస్తు వెబ్‌సైట్‌లో   పేర్లు నమోదు చేసుకున్న  యువతీ యువకులు, వారి కుటుంబ సభ్యులు  తమ అభిప్రాయాలను ప్రత్యక్షంగా తెలియజెప్పే టెక్నాలజీని ఇందులో కల్పించారని, ఇది ప్రశంసనీయమైన విషయమన్నారు. ‘శ్రీరస్తు‘ పక్షపత్రిక  సంపాదకురాలు శ్రీమతి సుధగారి  గురించి చెప్పాల్సిన పనిలేదు.  అమెరికా పర్యటన సమయంలో ఇంటర్‌నెట్ రిపోర్టర్‌గా  ఆమె వేసిన ప్రశ్నలు ఆమెలోని డైనమిక్ పర్సనాలిటీని తెలియజేసిందన్నారు. మంచి ప్రశ్నలను ఆమె అడిగారన్నారు.

రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ మంత్రి శ్రీమతి రాజ్యలక్ష్మి  మాట్లాడుతూ ‘ శ్రీరస్తు‘ పక్షపత్రిక విజయదశమినాడు విడుదల కావడం సంతోషకరమన్నారు. ఒక మహిళ సంపాదకత్వంలో శ్రీరస్తు  పక్షపత్రిక  రావడం శుభపరిణామమన్నారు. ‘శ్రీరస్తు‘ అంటే శుభమని ,  శ్రీమతి సుధ గారి సంపాదకత్వంలో  వచ్చిన పక్షపత్రిక  గురించి చెప్పాలంటే అమృతం తాగే ముందు రుచి ఎలా ఉంటుందోనని  చెప్పడమేనన్నారు.  సంస్కృతి సంప్రదాయాలతోపాటు నేటి యువతరానికి కావలసిన అన్ని విషయాలు ఇందులో ఉన్నాయి. ఒకవైపు తెలుగులోను, మరోవైపు ఇంగ్లీష్‌లో ఈ పత్రిక వెలువడటం ఇది తెలుగు పత్రికారంగంలో మొదటిసారని చెప్పారు. తెలుగు పక్షపత్రిక లో  ఇంగ్లీష్ ఎందుకు అని తాను సుధగారిని  ప్రశ్నించినప్పుడు నేటి తెలుగువారు ముఖ్యంగా పిల్లలు తెలుగులో చదవలేకపోతున్నారని అందుకే ఇంగ్లీష్ కూడా చేర్చామని  చెప్పారు.  ఆ మాట వినగానే తనకు ఎంతో బాధ అనిపించిందన్నారు. తెలుగువారు ఇంకా  పూర్తిగా తెలుగువాళ్ళం కాకపోతున్నామా అని అనిపించింది.

పిల్లలకు తెలుగు నేర్పండి.  ముఖ్యంగా  ప్రాథమిక విద్య ప్రతి పిల్లవానికి  అందేలా చేసినప్పుడే ప్రగతి సాధ్యమవుతుందన్నారు.

ఈ సంప్రదాయ  పక్షపత్రిక  ఇంటిల్లిపాదికి మాత్రమే కాదు, మూలనున్న ముసలమ్మలకు,  యువతీ యువతులకు ఉపయోగపడేలా ఇందులోని విషయాలు ఉన్నాయి.  నేటితరానికి కావలసిన టెక్నాలజీ, ఫ్యాషన్ అన్నీ కూడా ఇందులో ఉన్నాయి. పిల్లలకు మంచి మర్యాద, మన్నన అన్నీ చక్కటి కదంబంలా కుదిరింది. శ్రీరస్తు, శుభమస్తు, సకలకార్యసిద్ధిరస్తు అని ఆమె అన్నారు.

ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీ కె. రామచంద్రమూర్తిగారు మాట్లాడుతూ హార్మోనియస్ మేరేజ్  బిట్వీన్ ప్రింట్ అండ్ వెబ్‌సైట్‌గా దీనిని  అభివర్ణించారు. మహిళలు పత్రికల్లోకి రావడమే అరుదైన విషయమని, ' శ్రీరస్తు ' పక్షపత్రిక  సంపాదకురాలు సుధగారు డైనమిక్ అని, ఈ పక్షపత్రిక ని కూడా డైనమిక్‌గా తీర్చిదిద్దాలని తాను కోరుకుంటున్నానని చెప్పారు. నేడు పెళ్ళిళ్ళ పేరయ్యలు లేరు. అందుకే వెబ్‌సైట్‌లు అవసరమయ్యాయన్నారు.

రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ దేవులపల్లి అమర్  మాట్లాడుతూ, పత్రికను నడపటం చాలా కష్టమని, ప్రారంభించడం తేలిక అని చెప్పారు. నేడు అంశాల వారీగా  వచ్చే  మ్యాగజైన్‌లకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. అటువంటికోవలోనే  ఈ పక్షపత్రిక ను కూడా తీసుకువచ్చారన్నారు.  సమాచార చట్టం అమల్లోకి  వచ్చిననాడే ఈ పక్షపత్రిక  కూడా వెలువడటం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమానికి  తెలుగుటైమ్స్ ఎడిటర్ సి.వి. సుబ్బారావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆంధ్రజ్యోతి జనరల్ మేనేజర్ సర్క్యులేషన్ శ్రీ రామకృష్ణ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.